క్లుప్తంగా

నేడు వరద బాధితులకు అవోపా భారీ వితరణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలో వరద బాధితులకు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో శుక్రవారం భారీస్థాయిలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు తెలిపారు. గురువారం అరండల్‌పేటలోని అవోపా గుంటూరు శాఖ కార్యాలయంలో నగర అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన అవోపా ఆపద్బంధు పథకానికి గుంటూరు అవోపా శాఖ నుంచి రూ.2,56,546లను అందజేశారు. ఈసందర్భంగా తడవర్తి రాంబాబు మాట్లాడుతూ శుక్రవారం విజయవాడలో 600 కుటుంబాలకు గాను ఒక్కో కుటుంబానికి రూ.ఐదువేల చొప్పున రూ.30 లక్షల నగదు, రూ.10 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ రామ్ కుమార్, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

కెనడి నెక్ట్స్‌జెన్ కిడ్స్‌లో దసరా సంబరాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట 2వలైనులోని కెనడి నెక్ట్స్‌జెన్ కిడ్స్‌లో గురువారం ముందస్తు దసరా ఉత్సవాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు, వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్ బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ఇన్‌చార్జి వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు సుఫియా, మాధవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్ 4వలైనులోని కెనడీ నెక్ట్స్‌జెన్ కిడ్స్ స్కూల్లో వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులు నవదుర్గల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్ బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత పాల్గొన్నారు.

అవగాహన ఆధ్వర్యంలో వయో వృద్ధుల దినోత్సవం

లక్ష్మీపురం: అనుభవజ్ఞులైన సీనియర్ సిటిజన్స్ విశ్రాంత జీవితంలో కూడా అవిశ్రాంతంగా సేవలందిస్తూ ఉన్నారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రెండు రోజుల పాటు కొనసాగిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా గురువారం సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ది సెంట్రల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఆర్.రాము, న్యాయవాది అవధానుల హరి, సంస్థ సీనియర్ సభ్యులు మల్లేశ్వరరావు, బాపయ్య చౌదరి తదితరులు సత్కార గ్రహీత సేవలు ప్రశంసించారు.

సంతోష్ హోండా దసరా, దీపావళి ఆఫర్లు



నగరంపాలెం: దసరా, దీపావళి పండుగల దృష్ట్యా గుంటూరు కొత్తపేట సంతోష్ హోండా షోరూంలో ప్రత్యేక, ఆఫర్లు, బహుమతులు ప్రకటించారు. 22 ఏళ్లుగా గుంటూరు, కృష్ణాజిల్లా ద్విచక్ర వాహనదారులకు సుపరిచితమైన ఈ షోరూంలో హోండా యాక్టివ్ కొనుగోళ్లపై రూ.11,299 విలువైన బహుమతులను అందజేయనున్నట్లు సంస్థ జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ రెండు పండుగ వేళల్లో వాహనాల కొనుగోళ్లపై అతి తక్కువ వడ్డీ, తక్కువ డౌన్‌పేమెంట్, సరళమైన ఈఎంఐలు, డోర్ డెలివరీ సదుపాయం, పాత వాహనాలు మార్పిడి చేసే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలోని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం హోండా యాక్టివా కొనుగోలు చేసిన కొనుగోలుదారునికి బహుమతులు అందించారు.



చుట్టుగుంట పోలేరమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారికి బాలా త్రిపురసుందరీదేవి అలంకారం



బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా..



శ్రీమారుతి దేవాలయ సంఘంలో ...



విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో...

వైభవంగా దేవీశరన్నవరాత్రులు ప్రారంభం

నగరంపాలెం: నగరంలోని దేవాలయాలు, మండపాల్లో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం వేకువజాము నుంచి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. జగన్మాత నామస్మరణంతో మార్మోగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు. స్వచ్ఛంద సేవ సంస్థలు చల్లని నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. అరండల్‌పేట, బ్రాడీపేట, బృందావన్‌గార్డెన్స్, సంపత్‌నగర్, ఆర్ అగ్రహారం, మంగళగిరి రోడ్డు, స్తంభాల గరువు, మారుతీనగర్, ఏటీ అగ్రహారం, పాత గుంటూరు, మంగళగిరి రోడ్డు తదితర ఏరియాల్లోని దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపురసందరీ దేవీ, హంస వాహన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారిని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

అభివృద్ధి అంతంత మాత్రమే

- టీడీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి పనులు
- కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన పశ్చిమ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- సానుకూలంగా స్పందించిన కమిషనర్, పూర్తి స్థాయిలో మెరుగుకు హామీ



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

నెహ్రూనగర్: ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తమ డివిజన్లలో అభివృద్ధి కుంటుపడిందని పనులు కూడా పూర్తి నాసిరకంగా చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఆరోపించారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుకు విన్నవించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఇంకా ప్రారంభానికి నోచుకోని పనుల వివరాలను కమిషనర్‌కు వివరించారు. గుంటూరుకు గుండెకాయ వంటి బ్రాడీపేట 4వ లైన్ రోడ్డు విస్తరణ పనులు ఎస్ క్యాప్‌లో మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదన్నారు. ఏటీ అగ్రహారంలో రోడ్డు విస్తరణ పనులు నరకయాతన కలిగిస్తున్నాయన్నారు. 43, 44, 45 డివిజన్ల ప్రజలకు ప్రధాన రహదారిగా ఉపయోగపడుతున్న 45వ డివిజన్ పరిధిలోని వైకుంఠదామం రోడ్డుకు గత ప్రభుత్వ హయాంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పూర్తి నిర్లక్ష్య ధోరణితో నేటి వరకు పనులు ప్రారంభించక పోవడాన్ని వారు ఆక్షేపించారు. ముత్యాలరెడ్డినగర్ 8వ లైన్ రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారని, తిరిగి దాన్ని నిర్మించాలని వారు కమిషనర్‌ను కోరారు. కమిషనర్ పులి శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అన్ని పనులకు టెండర్లు పిలుస్తామని.. ఇప్పటికే టెండర్ దక్కించుకున్న పనులు త్వరితగతిన ప్రారంభం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, కాండ్రకుంట గురవయ్య, యక్కలూరి మారుతి, బోడపాటి ఉషా, అడకపద్మావతి, షేక్ జుమ్మాబి బాబు, వంగల హేమలత, పడాల సుబ్బారెడ్డి, అందుగుల సంతోష్, గోపి శ్రీనివాస్, ఉడుముల లక్ష్మీ శ్రీనివాసరెడ్డి, ఏరువ సాంబిరెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్, వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో కలసి పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలు పాటించడం, బిల్లుల చెల్లింపు, కాంట్రాక్టర్ల సమస్యలపై గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు నిర్వహించారు. తొలుత నగరపాలక సంస్థ పరిధిలో కాంట్రాక్టర్ల వారీగా టెండర్ పొందిన పనులు, పెండింగ్ పనులు, బిల్లుల చెల్లింపుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధికి కీలకమైన పనులను టెండర్ పొందిన కాంట్రాక్టర్లు వెంటనే చేపట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి పని నేరుగా తనిఖీ చేసిన అనంతరమే బిల్లుల చెల్లింపు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరు చేసే అమృత్, ఎస్.క్యాప్, 15 ఫైనాన్స్‌ల్లో జరిగే పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని, అందుకు సంబంధించిన చెల్లింపులు అంతే వేగంగా చేస్తామన్నారు. ఇసుక ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేస్తే వెంటనే అనుమతులు ఇస్తున్నామన్నారు.

కమిషనర్ పులి శ్రీనివాసులు

రైల్వే అభివృద్ధి పనులపై అలసత్వం వహిస్తే చర్యలు

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- అండర్ పాస్ లో డ్రైనేజ్ పైపులు లీకులు
- ప్రతి నెలా సమీక్షించి, చర్యలు తీసుకుంటాం



గుంటూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి

లక్ష్మీపురం: రైల్వే ప్రాజెక్టు పనులపై అలసత్వం వహిస్తే సహించబోమని, అండర్ పాస్‌లో డ్రెయినేజీ లీకులను అరికట్టాలని, నిధులున్నా రైల్వే కాంట్రాక్ట్ పనులు ముందుకు కదలడం లేదని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక గుంటూరు రైల్వే స్టేషన్‌ను గురువారం ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, డీఆర్‌ఎం రామకృష్ణలతో కలసి సందర్శించారు. తొలుత రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రైల్వే ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతి గురించి డీఆర్‌ఎం రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. అండర్ పాస్‌లో డ్రెయినేజీ లీకులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌కు గడువు ఇచ్చారు. రైల్వే అండర్ పాస్‌లో డ్రెయినేజీలు లీకై నీరు నిల్వ ఉండడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ సమస్యలపై ఆటో డ్రైవర్లు, ప్రయాణికులతో మాట్లాడారు. గుంటూరు సమగ్ర ప్రభుత్వాస్పత్రికి ఎదురుగా ఉన్న రైల్వే స్టేషన్ ప్రధాన గేటును మారిస్తే కొంత ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానిక ప్రజాప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గుంటూరుకు రెండు మేజర్ ప్రాజెక్టులు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా గుంటూరుకు రెండు మేజర్ రైల్వే ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రూ.150 కోట్లతో మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ, రూ.40 కోట్లతో అమృత్ భారత్ స్కీమింగ్ ద్వారా ఇతర పనులు మంజూరయ్యాయి అన్నారు. అమృత్ భారత్ స్కీమ్ పనుల్లో కొన్ని 70 శాతం, మరికొన్ని 20 శాతం, 40 శాతం పూర్తయ్యాయని వివరించారు. మల్టీ ట్రాకింగ్ పనుల్లో కొన్ని 53 శాతం వరకే జరిగాయన్నారు. మల్టీ ట్రాకింగ్ పనులు మార్చిలోగా పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెప్పారని, వీటిని ప్రతి నెలా స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి సమీక్షిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణ, రైల్వే చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.మనోహర్ రెడ్డి, డీసీఎం ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

మూడో రోజు దీక్ష

లక్ష్మీపురం: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడో రోజు గుంటూరు కలెక్టరేట్ ఎదుట రైతుసంఘాల ఆధ్వర్యంలో గురువారం దీక్ష నిర్వహించారు. రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు, నల్లమడ రైతుసంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ ప్రారంభించారు. రైతు సంఘాల నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన దీక్షలు జరిగాయి.

సుమేధ హైస్కూల్‌కు ఉత్తమ పాఠశాల అవార్డు



గుంటూరు ఎడ్యుకేషన్: స్వచ్ఛతా హి సేవలో పాల్గొన్న గుంటూరు నగరంలోని పాఠశాలల స్థాయిలో ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్ ఉత్తమ పాఠశాల అవార్డు అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బుధవారం నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ ముగింపు కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కళాశాలలో గురువారం కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సమావేశంలో సమీక్ష చేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి అధ్యక్షత వహించారు. మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, డీఎంఈ డాక్టర్ నరసింహం జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ కొన్ని అంశాల గురించి సూచనలు అందించారు. ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు ఉన్నారని, అదే విధంగా మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీలో కూడా జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. దీనివల్ల మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రులను సింగిల్ యూనిట్ గా తీసుకొని జిల్లా కలెక్టర్, ప్రతినిధులు సీఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా అభివృద్ధి చేసేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. అందుకు డీఎంఈ స్పందిస్తూ మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీలో వారిని చేర్చే విషయంలో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించి అనుమతి తీసుకుంటామని సూచించారు. బొంగరాల బీడులోని ఆరు ఎకరాల స్థలాన్ని కాపాడేందుకు హెచ్‌డీఎస్‌లో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని డీఎంఈ హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీలో కేవలం 7, 8 విభాగాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోని వివిధ విభాగాలను కూడా సమదృష్టితో చూడాలని సూపరింటెండెంట్ సూచించారు. ఆస్పత్రిలోని ప్రతి విభాగానికి అవసరమైన పరికరాలను సీడీఎస్ ఫండ్స్ నుంచి ఇవ్వాలని సూపరింటెండెంట్ కోరగా ఈ ప్రతిపాదనలను వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ప్రిన్సిపాల్ ద్వారా నిర్ణయం తీసుకోవాలని డీఎంఈ ఆదేశించారు. ముఖ్యమైన పరికరాలను కొనుగోలు చేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని డీఎంఈ అన్నారు. స్వచ్ఛభారత్‌లో పాల్గొనే వలంటీర్లను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను భాగస్వాములు చేయాలని సూపరింటెండెంట్ కోరగా ప్రిన్సిపాల్‌తో చర్చించి నిర్ణయం తీసుకోవాలని డీఎంఈ సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని శుశ్రుత హాలు అభివృద్ధి కోసం ఎన్టీఆర్ యూనివర్సిటీ బడ్జెట్ ద్వారా అభివృద్ధి చేసేందుకు గతంలో మెడికల్ కళాశాల ద్వారా ప్రతిపాదనలు పంపించినట్లు సూపరింటెండెంట్, డీ ఎంఈ దృష్టికి తీసుకుని వెళ్లగా పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ ఉమా జ్యోతి, డాక్టర్ శంకర రావు, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ముంబాయి క్రైం బ్రాంచ్ పేరుతో రూ.10 లక్షలకు టోకరా

లక్ష్మీపురం: మనీ లాండరింగ్ చేస్తున్నారని మీ ఖాతా ఫ్రీజ్ చేస్తున్నామంటూ ముంబై క్రైం బ్రాంచ్ ఎస్ఐ అని చెప్పి రూ.10 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. చంద్రమౌళినగర్ ప్రాంతానికి చెందిన పమిడి ముక్కల రామకృష్ణ కెనరా బ్యాంక్ ఖాతాలో నుంచి మనీ లాండరింగ్ చేస్తున్నారని బెదిరించి రూ.10 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. గురువారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

స్థానిక శ్యామలానగర్‌లోని మై మార్ట్ సూపర్ మార్కెట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు సూపర్ మార్కెట్ కౌంటర్‌లోని రూ.92,500 నగదు, పలు రకాల సామగ్రి దొంగలించిన ఘటన పై గురువారం పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు రవీంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవిద్యా వస్త్రాలయంలో దసరా సేల్ ఆఫర్లు



నగరంపాలెం: దసరా పండుగ సందర్భంగా బ్రాడీపేట 4/2వ అడ్డరోడ్డులోని శ్రీవిద్యా ఉమెన్ ఫ్యాషన్ షోరూంలో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. ఈనెల 3 నుంచి 12 వరకు సేల్స్ ఆఫర్స్ 30 శాతం అని, ఆకర్షణీయమైన కలెక్షన్స్‌తో అందరికీ అందుబాటు ధరలలో అందించనున్నట్లు సంస్థ ఎండీ ఓంప్రకాష్ గురువారం తెలిపారు. కాంచీవరం పట్టు, డిజైనరీ శారీస్, టస్సర్, బెనారస్, అన్ స్టిచ్ సూట్స్, సల్వార్స్, కుర్తీస్ వంటి అనేక వస్త్రాలు నూతన డిజైన్లతో సరికొత్త స్టాక్ వచ్చిందని అన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.